క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(బారకాసు): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాన్ని అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలియజేశారు. నియోజకవర్గంలో పార్టీ కార్యకర్తలపై బనాయిస్తున్న అక్రమ కేసులపై తెలియజేశారు.

భోగి మంటల్లో టైర్లు వేయొద్దు



నెల్లూరు(వీఆర్సీసెంటర్): భోగి మంటల్లో టైర్లు, ట్యూబ్‌లు, ప్లాస్టిక్ వస్తువులను వేసి పర్యావరణాన్ని నాశనం చేయొద్దని పలువురు కోరారు. ఈ మేరకు వెంకటేశ్వరపురంలోని నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని బ్లాక్‌బోర్డు మిత్రమండలి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. శివప్రసాద్, రవికుమార్, ప్రసాద్, మహ్మద్ గౌస్, సుభాష్‌రెడ్డి, రామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

10న బహిరంగ వేలం

నెల్లూరు(క్రైమ్): ప్రభుత్వ మద్యం దుకాణాల రద్దుతో అందులోని సామగ్రిని ఏపీ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ అధికారులు స్వాధీనం చేసుకొని వేదాయపాళెం గాంధీనగర్ రోడ్డులోని గోదాములో భద్రపర్చారు. అక్కడున్న 171 ఫ్రీజర్లు, 159 ఇన్వర్టర్ విత్ బ్యాటరీలు, 146 క్యాష్ చెస్ట్‌లు, 324 స్కానర్లు, 141 నగదు కౌంటింగ్ మెషీన్లను గోదాము వద్ద ఈ నెల 10న బహిరంగ వేలం వేయనున్నామని ఏపీఎస్బీసీఎల్ నెల్లూరు డిపో మేనేజర్ ఆయేషాబేగం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్కో ఫ్రీజర్ ధర రూ.18,900, ఇన్వర్టర్, బ్యాటరీలు రూ.15,525, క్యాష్ చెస్ట్ రూ.5,100, స్కానర్ రూ.2,837, నగదు కౌంటింగ్ మెషీన్‌కు రూ.675గా ధరను నిర్ణయించామన్నారు. ఆసక్తి గల వారు పదో తేదీ ఉదయం పది గంటల్లోపు వస్తువులను పరిశీలించి వేలంలో పాల్గొనవచ్చన్నారు. పాడుకున్న వస్తువుల ధర మొత్తాన్ని 18 శాతం జీఎస్టీతో కలిపి వెంటనే చెల్లించాల్సి ఉంటుందన్నారు. వివరాలకు 90000 15109, 99493 51043, 98850 34694 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

తాటిపర్తిలో రోజూ ఫీవర్ సర్వే

పొదలకూరు: మండలంలోని తాటిపర్తిలో జ్వరాలు అదుపులోకి వచ్చే వరకూ రోజూ ఫీవర్ సర్వేను కొనసాగించాల్సిందిగా డీఎంహెచ్‌ఓ బి.సుజాత ఆదేశించారు. మహ్మదాపురం పీహెచ్‌సీను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఎంహెచ్‌ఓ పక్క గ్రామమైన తాటిపర్తిలో జ్వరాలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో దోమల లార్వాను పూర్తిగా నాశనం చేయాల్సిందిగా సూచించారు. వైద్య శిబిరాన్ని కొద్దిరోజులు కొనసాగించాలని, పారిశుద్ధ్య పనులను వైద్య సిబ్బంది సైతం దగ్గరుండి పర్యవేక్షించాలని పేర్కొన్నారు. ఇంటింటి సర్వేలో పాల్గొన్న డీఎంహెచ్‌ఓ జ్వరపీడితుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి శుక్రవారాన్ని డ్రైడేగా పాటించాలన్నారు. ఏ గ్రామంలోనైనా ఐదుగురికి మించి జ్వరపీడితులు ఉంటే వెంటనే వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా వైద్యాధికారులను ఆదేశించారు. విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. మహ్మదాపురం పీహెచ్‌సీలో నిర్వహిస్తున్న ఆశావర్కర్ల సమావేశంలో డీఎంహెచ్‌ఓ పాల్గొని గ్రామాల్లో ఎప్పటికప్పుడు సమాచారం వైద్యాధికారుల దృష్టికి తీసుకురావాల్సిందిగా పేర్కొన్నారు. ఎవరైనా జ్వరాలతో బాధపడుతుంటే వెంటనే తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు నరసింహారావు, స్రవంతి, కిరణ్ రిషిత, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో ప్రతిభ

కోవూరు: గూడూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఇటీవల నిర్వహించిన ఇంటర్ కాలేజీయేట్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌లో గీతాంజలి కళాశాల విద్యార్థులు జిల్లా స్థాయిలో ప్రతిభ చూపారని కళాశాల కార్యదర్శి సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు కళాశాల ఆవరణలో మంగళవారం నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బాల్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, కబడ్డీ, ఖోఖోలో అత్యుత్తమ ప్రతిభ చూపారని వివరించారు. విశాఖపట్నంలో ఈ నెల 28 నుంచి 30 వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ మీట్‌లో వీరు పాల్గొననున్నారని చెప్పారు. ప్రిన్సిపల్ సతీష్‌కుమార్, కళాశాల ట్రెజరర్ విజయశంకర్, కళాశాల పీడీ అశోక్‌కుమార్, అడ్మిన్ భీమ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నగరమా.. అడవా..?



ఎన్టీఆర్‌నగర్, పద్మావతినగర్‌లో ఏపుగా పెరిగిన ముళ్లపొదలు

- ఇళ్ల చుట్టూ ముళ్ల పొదలు
- పాములు, విష పురుగుల సంచారం
- బెంబేలెత్తుతున్న ప్రజలు

నెల్లూరు (పొగతోట): నగరంలోని పలు ప్రాంతాలు అడవులను తలపిస్తున్నాయి. ఇక్కడ పిచ్చి చెట్లు ఏపుగా పెరిగి విషసర్పాలకు కేంద్రాలుగా మారుతున్నాయి. వాస్తవానికి ఆయా స్థలాల యజమానులు వీటిని ఎప్పటికప్పుడు తొలగించాల్సి ఉంది. అయితే కార్పొరేషన్ అధికారులు పట్టించుకోకపోవడంతో ఆయా యజమానులు తమకేమనే ధీమాతో ఉన్నారు. ఫలితంగా ప్రజలు బెంబేలెత్తుతున్నారు.

ఇదీ పరిస్థితి..

నగరంలోని ఎన్టీఆర్‌నగర్, పద్మావతినగర్, బాలాజీనగర్, ఏసీనగర్, సుందరయ్య కాలనీ, పడారుపల్లి, హౌసింగ్ బోర్డు కాలనీ తదితర ప్రాంతాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది. ఇళ్ల చుట్టూ కంప్రతుమ్మ చెట్లు, పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగిపోయాయి. ఫలితంగా రాత్రీ, పగలనే తేడా లేకుండా విషసర్పాలు సంచరిస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో అవి ఇళ్లలోకి ప్రవేశిస్తుండటంతో ప్రజలు హడలిపోతున్నారు. వర్షాలు ఇటీవల కురవడంతో సమస్య తీవ్రరూపం దాలుస్తోంది.

జంగిల్ క్లియరెన్సేదీ..?

ఎన్టీఆర్‌నగర్ సమీపంలోని వేణుగోపాలస్వామి కళాశాల మైదానం అడవిని తలపిస్తోంది. ఇక్కడ జంగిల్ క్లియరెన్స్ చేయడాన్ని విస్మరించారు. దీంతో మైదానం చుట్టుపక్కల పేడ దిబ్బలు, ముళ్ల చెట్లు అధికమయ్యాయి. మరోవైపు సమీపంలో నివాసం ఉంటున్న వారు చెత్తాచెదారాలను తీసుకొచ్చి ఇక్కడ పడేయడం పరిపాటిగా మారుతోంది. నగరపాలక సంస్థ అధికారులు కఠినంగా వ్యవహరించి పిచ్చి మొక్కలను ఆయా స్థలాల యజమానులు తొలగించేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

స్వచ్ఛమైన తాగునీటిని అందించాలి



మాట్లాడుతున్న వెంకటలక్ష్మి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ప్రభుత్వ వసతి గృహాల్లోని విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి వెంకటలక్ష్మి పేర్కొన్నారు. మద్రాస్ బస్టాండ్ సమీపంలోని జిల్లా కార్యాలయంలో బీసీ వెల్ఫేర్ అధికారులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పదో తరగతి విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. విద్యార్థుల వ్యక్తిగత పరిశుభ్రత, విద్య తదితరాలపై పలు సూచనలు చేశారు. బీసీడబ్ల్యూఓలు ప్రసూన, శ్రీదేవి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బకాయిలను వెంటనే వసూలు చేయండి

నెల్లూరు(బారకాసు): ఎల్‌ఆర్‌ఎస్, ఏపీడీపీఎమ్మెస్ తదితరాలకు సంబంధించిన ఫీజు బకాయిలను వెంటనే వసూలు చేయాలని అదనపు కమిషనర్ నందన్ ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో టౌన్ సర్వేయర్లు, మినిస్టీరియల్ సిబ్బంది, టౌన్‌ప్లానింగ్ విభాగ సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని సిటీ ప్లానర్ హిమబిందుతో కలిసి మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బకాయిల వసూళ్లలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.



మాట్లాడుతున్న నందన్

క్రీడలతో మానసికోల్లాసం



విజేతలతో నిర్వాహకులు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): క్రీడల్లో పాల్గొనడం ద్వారా మానసికోల్లాసం, దేహదారుఢ్యం వస్తుందని నెహ్రూ యువ కేంద్ర జిల్లా అధికారి మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జిల్లా స్థాయి స్పోర్ట్స్ మీట్‌ను ప్రజాసత్తా యూత్ ఆధ్వర్యంలో నెహ్రూ యువ కేంద్ర సహకారంతో మంగళవారం నిర్వహించారు. 100 మీటర్ల పరుగు, షాట్‌పుట్, వాలీబాల్ పోటీలను నిర్వహించి విజేతలకు జ్ఞాపికలు, సర్టిఫికెట్లను అందజేశారు. ప్రజాసత్తా వ్యవస్థాపకుడు పులగర శోభన్‌బాబు, హిమతేజ, మురళీమోహన్‌రాజు, ఖాజాబీ, పీఈటీలు ప్రేమ్‌కుమార్, థామస్ పీటర్, మోహన్‌రావు, నాగరాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఆనంద్, డీఎంహెచ్‌ఓ సుజాత

నెల్లూరు(అర్బన్): ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ టేబుల్ క్యాలెండర్లను కలెక్టర్ ఆనంద్ తన చాంబర్‌లో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలను నేతలు తెలియజేశారు. ఎన్జీఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మన్నేపల్లి పెంచలరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారుపల్లి వెంకటేశ్వర్లు, కార్యదర్శి రామకృష్ణ, అసోసియేట్ అధ్యక్షుడు ఆంజనేయ వర్మ, నేతలు ప్రసాద్‌రెడ్డి, లక్కాకుల పెంచలయ్య, కరుణమ్మ, కృష్ణంరాజు, కిరణ్, సతీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

- ఏపీ హెల్త్ అండ్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన జిల్లా, తాలూకా క్యాలెండర్లను జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌ఓ సుజాత.. పెద్దాస్పత్రి ఆవరణలోని పీపీ యూనిట్‌లో మెడికల్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. హంస జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చేజర్ల సుధాకర్‌రావు, కమల్ కిరణ్, నేతలు మజరుల్లా, సహన, మురళీకృష్ణ, నాగరాజమ్మ, ఉషారాణి, గౌస్‌బాషా, పృథ్వి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పడారుపల్లిలో అన్నదానం

నెల్లూరు(బృందావనం): పడారుపల్లి దివ్యాంగుల కాలనీలోని పీసీ రెడ్డి సమాజ మందిరంలో అన్నదానాన్ని మంగళవారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే స్వర్ణ వేమయ్య సతీమణి వాణిదేవి వర్ధంతిని పురస్కరించుకొని కుమారుడు స్వర్ణ గంగాధర్, విజయలక్ష్మి దంపతుల సౌజన్యంతో కార్యక్రమాన్ని చేపట్టారు. క్రాంతి మహిళా మండలి అధ్యక్షురాలు గుమ్మడి వెంకటలక్ష్మి, శ్రీలత, హరనాథ్‌రెడ్డి, విజయలక్ష్మి, తంబయ్యనాయుడు, సుధాకర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ

నెల్లూరు(క్రైమ్): వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును గుర్తుతెలియని మహిళ తెంపుకెళ్లిన ఘటన రెవెన్యూ కాలనీలో మంగళవారం పట్టపగలు చోటుచేసుకుంది. వివరాలు.. రెవెన్యూ కాలనీలోని శిల్పా స్కూల్ సమీపంలో పార్వతమ్మ నివాసం ఉంటున్నారు. భర్త పనికెళ్లడంతో ఆమె ఒంటరిగా ఉన్నారు. ఈ క్రమంలో బురఖా ధరించిన ఓ మహిళ పిట్టగోడ దూకి ఆమె ఇంట్లోకి ప్రవేశించారు. వృద్ధురాలి మెడలోని సుమారు మూడున్నర సవర్ల బంగారు సరుడును తెంపుకెళ్లారు. వృద్ధురాలు తేరుకునేలోపే అక్కడి నుంచి పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఘటన స్థలాన్ని దర్గామిట్ట పోలీసులు పరిశీలించారు. తెలిసిన వారి పనై ఉండొచ్చనే అనుమానాల నేపథ్యంలో ఆ దిశగా పోలీసులు విచారణ జరుపుతున్నారని తెలిసింది.

యూరియాకు కొరత తలెత్తకూడదు



మాట్లాడుతున్న ప్రశాంతిరెడ్డి


నెల్లూరు(సెంట్రల్): జిల్లాలోని రైతులకు యూరియా కొరత లేకుండా చర్యలు చేపట్టాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పేర్కొన్నారు. నగరంలోని తన కార్యాలయంలో వ్యవసాయాధికారులతో సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.

పెద్దాస్పత్రిలో తనిఖీలు



నెల్లూరు(అర్బన్): నగరంలోని ప్రభుత్వ పెద్దాస్పత్రిలో తనిఖీలను ఆస్పత్రి ఏఓ, డిప్యూటీ కలెక్టర్ మహేశ్వరరెడ్డి మంగళవారం చేపట్టారు. ఆక్సిజన్ ప్లాంట్‌ను తనిఖీ చేశారు. లిక్విడ్ ఆక్సిజన్‌ను బయట నుంచి కొనుగోలు చేస్తూ.. గాలి ద్వారా ఆక్సిజన్‌ను తయారు చేసే ప్రాజెక్ట్‌ను ఎందుకు మూలనపడేశారని ప్రశ్నించారు. మరమ్మతులు చేయించి ఉపయోగంలోకి తీసుకొస్తే నిధులను వెచ్చించాల్సిన అవసరం ఉండదని చెప్పారు. ఆస్పత్రిలో బెడ్లను పరిశీలించారు. బాత్‌రూమ్‌లకు సరిపడా నీళ్లు వస్తున్నాయాననే అంశాన్ని ఆరాతీశారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు మౌలిక వసతులను కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని వెల్లడించారు. ఏడీ ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యానికి పరాకాష్ట



పెద్దాస్పత్రి ఐపీ భవన వెనుక వైపు ఉన్న వాహనం

నెల్లూరు(అర్బన్): పెద్దాస్పత్రిలో సెక్యూరిటీ ఎంత నిర్లక్ష్యంగా ఉందో ఈ వాహనాన్ని చూస్తే అర్థమవుతుంది. తెలంగాణ నంబర్ ప్లేట్ ఉన్న గూడ్స్ మినీ లారీ ఆస్పత్రి వెనుక 25 రోజులుగా ఉంది. ముందు టైర్ పంక్చరై ఉంది. ఈ వాహనాన్ని తీసుకెళ్లేందుకు ఎవరూ రాలేదు. అసలు ఆ వాహనంలో ఏమున్నాయో తెలియదు. ఆస్పత్రి, మెడికల్ కళాశాల వద్ద సెక్యూరిటీ ఉన్నా, దీనిపై ఎవరూ పట్టించుకోవడంలేదు. సాధారణ తనిఖీల్లో భాగంగా ఈ వాహనాన్ని డిప్యూటీ కలెక్టర్ గమనించి ఇది ఎవరిదని ప్రశ్నించారు. ఆ సమయంలో తెల్లముఖం వేయడం అక్కడి వారి వంతైంది. చాలా రోజులుగా ఇక్కడే ఉందనే విషయాన్ని ఆయన తెలుసుకున్నారు. ఆయన ఆదేశాల మేరకు పోలీసులకు ఎట్టకేలకు సమాచారమిచ్చారు.

సామాన్యులకేనా నిబంధనలు..?

హెల్మెట్‌ధారణ సామాన్యులకే.. తమకు వర్తించదనే రీతిలో కొందరు పోలీసులు వ్యవహరిస్తున్నారు. వాస్తవానికి హెల్మెట్ ధరించని ద్విచక్రవాహనదారులపై నగరంలోని పోలీస్ అధికారులు కొద్దిరోజులుగా జరిమానాలను విధిస్తున్నారు. దీంతో హెల్మెట్లను పలువురు విధిగా ధరిస్తున్నారు. అయితే నిబంధనను పాటించాల్సిన కొందరు పోలీసులు యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారు. నగరంలో హెల్మెట్ ధరించని వారిపై పోలీస్ అధికారులు జరిమానాలను మంగళవారం విధిస్తుండగా, అటువైపుగా వెళ్లే కొందరు పోలీసులు దీన్ని పాటించలేదు. వీరిని పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి.

– నెల్లూరు(క్రైమ్)







పండగకెళ్దాం.. చలో.. చలో

- ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు
- 183 సర్వీసులు
- 9 నుంచి 12 వరకు అందుబాటులో..

నెల్లూరు సిటీ: సంక్రాంతి పండగ నిమిత్తం సొంతూళ్లకు వచ్చే వారికి ఆర్టీసీ తీపి కబురునిచ్చింది. టికెట్ దొరుకుతుందో.. లేదోననే ఆందోళనలో ఉన్న వారి సౌకర్యార్థం ప్రత్యేక సర్వీసులను అందుబాటులోకి తీసుకొచ్చింది. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై తదితర ప్రాంతాల నుంచి 183 ప్రత్యేక సర్వీసులను ఈ నెల తొమ్మిది నుంచి 12 వరకు నడపనున్నారు.

అదనపు చార్జీల్లేకుండానే..

ఏసీ, డీలక్స్, ఎక్స్‌ప్రెస్, అల్ట్రా డీలక్స్ బస్సు సర్వీసులకు రానూపోనూ టికెట్ తీసుకున్న ప్రయాణికులకు చార్జీల్లో పది శాతం రాయితీని కల్పించనున్నారు. మరోవైపు బస్సుల్లో సాధారణ చార్జీలనే వసూలు చేయనున్నారు.

సర్వీసులు ఇలా..

- హైదరాబాద్ నుంచి వచ్చే వారి కోసం ఈ నెల 9న 15.. పదిన 35.. 11న 32.. 12న ఏడు బస్సులను ఏర్పాటు చేశారు.



- బెంగళూరు నుంచి తొమ్మిదిన ఆరు.. పదిన 17.. 11న 12.. 12న ఏడు బస్సులను నడపనున్నారు.
- చెన్నై నుంచి తొమ్మిది, పది, 11, 12న ఐదు చొప్పున బస్సులను తిప్పనున్నారు.

సేవలను వినియోగించుకోవాలి

సంక్రాంతి పండగకు వచ్చే ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశాం. బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ నుంచి 183 బస్సులను నడపనున్నాం. సేవలను సద్వినియోగం చేసుకోవాలి.

– మురళీబాబు, ప్రజా రవాణాధికారి, నెల్లూరు జిల్లా

వేడుకగా పగల్‌పత్తు ఉత్సవాలు



గొల్లబోయి అలంకారంలో రంగడు



వటపత్రశాయిగా వేణుగోపాలుడు

నెల్లూరు(బృందావనం): నగరంలోని వైష్ణవాలయాల్లో పగల్‌పత్తు ఉత్సవాలను వేడుకగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో స్వామివారు గొల్లబోయి అవతారంలో మంగళవారం దర్శనమిచ్చారు. ఉభయకర్తగా దేవిశెట్టి వెంకటసుబ్బయ్య శెట్టి వ్యవహరించారు. ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

- మూలాపేటలోని రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో స్వామివారు వటపత్రశాయిగా దర్శనమిచ్చారు. ఉభయకర్తగా దేవిశెట్టి వీరవెంకటసుబ్బయ్య వ్యవహరించారు. దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తల మండలి చైర్మన్ మజ్జిగ చంద్రమౌళిరెడ్డి, ఈఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

నెల్లూరు (టౌన్): వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధిపై ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాన్ని నగరంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సమగ్రశిక్ష ఏపీసీ వెంకటసుబ్బయ్య మాట్లాడారు. నైపుణ్యాలు, అభివృద్ధి కోసం ఈ శిక్షణ తరగతులు ఎంతో ఉపయోగకరమని చెప్పారు. సమగ్రశిక్ష ఏఎంఓ సుధీర్‌బాబు, హెడ్‌మాస్టర్ కృష్ణారెడ్డి, ఈఎంపీడీ జోనల్ మేనేజర్ నీలిమ తదితరులు పాల్గొన్నారు.



రోడ్లకు పూర్తి స్థాయిలో మరమ్మతులు

నెల్లూరు(సెంట్రల్): నెల్లూరు రూరల్ పరిధిలో దెబ్బతిన్న రోడ్లకు పూర్తి స్థాయిలో మరమ్మతులను చేయిస్తామని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. అయ్యప్పగుడి నుంచి కేవీఆర్ పెట్రోల్ బంక్ వరకు రూ.2.52 కోట్లతో చేపట్టిన రోడ్ల మరమ్మతు పనులను కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే మంగళవారం పరిశీలించారు.



పరిశీలిస్తున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

అర్చకులకు సత్కారం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని జనార్దన్‌రెడ్డి కాలనీలో గల రామాలయంలో అర్చకులు సత్యనారాయణ, రమేష్, వెంకటరామయ్య, రమణ దీక్షితులను దివ్యాంగుల ఐక్య సంఘ ఆధ్వర్యంలో మంగళవారం సత్కరించారు. ఐక్య సంఘ అధ్యక్షుడు సనావుల్లా, బ్లాక్‌బోర్డు మిత్రమండలి అధ్యక్షుడు ప్రసాద్, సత్యం, జకావుల్లా, శీనయ్య తదితరులు పాల్గొన్నారు.